క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆనంద్‌కు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పార్టీ నేతలు

మర్పల్లి: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను మర్పల్లి జెడ్పీటీసీ మధుకర్, పలువురు నాయకులు నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం కాంపు కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మర్పల్లి సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశం, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోట్‌మర్పల్లి రాచన్న, ఉపాధ్యక్షుడు పట్లూర్ అశోక్, యూత్ ప్రసిడెంట్ మధుకర్, సహకార సంఘం డైరక్టర్ యాదయ్య, నాయకులు రమేష్‌మిత్ర తదితరులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



జ్యోతిని వెలిగిస్తున్న అయ్యప్ప మాలధారులు

పెద్దేముల్: మండల కేంద్రంలో ఆదివారం హరిహర సుతన్ అయ్యన్ అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా జరిగింది. పెద్దేముల్ గ్రామానికి చెందిన గురుస్వామి నర్సింహారెడ్డి స్వగృహంలో మాలధారణ సందర్భంగా గురుస్వామి జగదీశ్వర్ ద్వారా పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి, తాండూరు, తింసాన్‌పల్లి, వికారాబాద్ తదితర గ్రామాల గురుస్వాములు పాండు, శంకర్, రవి, మల్లు, నర్సింహారెడ్డితో పాటు గంట, కత్తి, కన్యస్వాములు పాల్గొన్నారు. అనంతరం 41వ రోజు దీక్ష పూర్తి చేసుకున్న మల్లు గురుస్వామికి హనుమాన్ దేవాలయంలో ఇరుముడి కార్యక్రమం చేపట్టారు.

టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా నరేందర్



పరిగి: టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా నరేందర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్యలను జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు. తనను నమ్మి బాధ్యతలు అప్పగించిన జిల్లా, రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

భూ పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

చేవెళ్ల: భూ పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, పేద ప్రజల కోసం ఈ పోరాటాలు చేయాల్సి ఉంటుందని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగంలు అన్నారు. మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో ఆదివారం గ్రామశాఖ కార్యదర్శి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన సీపీఐ 98వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ 1925లో ఏర్పడిందని అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తూనే ఉందని చెప్పారు. పేద ప్రజల పార్టీగా గుర్తింపు పొందిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు అంజయ్య, మండల పార్టీ కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి మక్బుల్, గీత పనివాళ్ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

పోటీలతో క్రీడాకారుల మధ్య సత్సంబంధాలు

ఎంపీపీ ఎం.విజయలక్ష్మి

చేవెళ్ల: టోర్నమెంట్‌ల నిర్వహణ వల్ల క్రీడాకారుల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో నెలరోజులుగా జరుగుతున్న కవాడి చంద్రశేఖర్‌రెడ్డి స్మారక క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ టోర్నీలో విజేతగా ఆలూరు జట్టు నిలువగా, రన్నర్‌గా చేవెళ్ల జట్లు నిలిచాయి. ఈ ముగింపు వేడుకల్లో పాల్గొన్న ముఖ్యఅతిథులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు చక్కటి వేదికలుగా నిలుస్తాయని చెప్పారు. చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, దళితరత్న అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్‌లు మాట్లాడుతూ.. ఆటలపోటీల్లో గెలుపు ఓటములు సహజమేనని క్రీడాకారులు వాటిని సమానంగా తీసుకోవాలని చెప్పారు. స్నేహపూరితమైన వాతావరణంలో టోర్నీ నిర్వహించడంపై నిర్వాహకులను వక్తలు అభినందించారు.

అద్దె భవనాలతో అవస్థలు



వృథాగా ఎంపీపీ నూతన భవనం



నిరుపయోగంగా మర్పల్లి శాఖ గ్రంథాలయ భవనం

- ప్రారంభానికి నోచుకోని సర్కారు కొత్త భవనాలు
- అలంకారప్రాయంగా ఎంపీపీ, లైబ్రరీ బిల్డింగ్స్
- శిథిలావస్థ మిద్దెలతో భయపడుతున్న ఉద్యోగులు
- పుస్తక పఠనానికి చేరువ కాలేకపోతున్న పాఠకులు

మర్పల్లి: ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. కాంట్రాక్టర్ల జాప్యం, అధికారులు నిర్లక్ష్యం వెరసి పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పలు చోట్ల సొంత భవనాలు లేక అద్దింట్లో ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగిస్తుండగా.. మరికొన్ని చోట్ల సొంత భవనాలు ఉన్నప్పటికీ.. అవి శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో రూ. లక్షలు వెచ్చించి.. కొత్త మిద్దెలు నిర్మించినా.. అవి అలంకార ప్రాయంగా మిగిలిపోతున్నాయి.

2018లో పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ. కోటి, మండల పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలు వెచ్చించి మండల పరిషత్ భవన నిర్మాణం 6 నెలల్లో పూర్తిచేశారు. ఇక వినియోగంలోకి తీసుకురావడమే ఆలస్యం. కానీ.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో అది నిరుపయోగంగా మారింది. అయితే.. ప్రస్తుతం పరిపాలన కొనసాగుతున్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎంపీడీఓ అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్తగా నిర్మించిన ఎంపీపీ భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

గ్రంథాలయ భవనం..

గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో నాటి గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి.. నూతన భవనం కోసం రూ. 45 లక్షలు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్.. అనతి కాలంలోనే భవన నిర్మాణం పూర్తి చేశారు. కాని అదీ వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న లైబ్రరీ.. ఇరుకుగా ఉండడంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. అసలే పరీక్షల కాలం, ఉద్యోగాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. పోటీ పరీక్షలకు సిద్ధం అవాలంటే గ్రంథాలయాలు తప్పనిసరి. కాని ఇక్కడ తగిన సౌకర్యాలు లేక.. పట్టణ ప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందుతూ.. ఆర్థికంగా చితికి పోతున్నామని నిరుద్యోగులు వాపోతున్నారు. పూర్తయిన గ్రంథాలయ భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందికి ఇబ్బంది..



ప్రజా అవసరాల కోసం నిర్మించిన ఎంపీపీ, లైబ్రరి భవనాలను వినియోగంలోకి తీసుకు రావాలి. మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చెరడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. సమీక్ష గదుల్లో పై కప్పు పెచ్చులు ఊడుతున్నాయి. సమావేశాలకు వెళ్లాలంటే ఉద్యోగులు భయపడుతున్నారు. నిరుద్యోగ యువత, పాఠకుల కోసం గ్రంథాలయ భవనాన్ని అందుబాటులోకి తేవాలి. సంబంధిత అధికారులు స్పందించి.. నూతన భవనాలను ప్రారంభించాలి.

– బాల్‌రెడ్డి, ఎంపీటీసీ, బూచన్‌పల్లి

సౌకర్యంగా లేదు..



ప్రస్తుతం కొనసాగుతున్న లైబ్రరీ భవనం సౌకర్యవంతంగా లేదు. ఇరుకు గదులతో పాఠకులకు ఇబ్బందిగా ఉంది. పుస్తక పఠనానికి అనువుగా లేకపోవడంతో పాఠకులు రావడం తగ్గించారు. కొత్త భవనాన్ని ప్రారంభిస్తే.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ఉప యోగకరంగా ఉంటుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి

– కోమారి వెంకటేశం, పాఠకుడు, మర్పల్లి

జూనియర్ కళాశాల మంజూరు చేయండి

మంత్రి సబితారెడ్డికి నేతల వినతి



మంత్రి సబితారెడ్డితో నేతలు

బంట్వారం: ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలంటూ బీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వడ్ల నందు మంత్రి సబితారెడ్డికి విన్నవించారు. శనివారం ఆయన ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి.. స్థానిక ప్రజాప్రతినిధులతో మంత్రిని ఆమె నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నందు.. మండలానికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెనుకబడిన బంట్వారం మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించనట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పార్టీ నేతలు

దోమ: కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. ఆదివారం బొంపల్లి గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను బీఆర్‌ఎస్ నేతలు, గ్రామస్తులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి.. శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు అందేవిధంగా ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, సర్పంచ్ సురేశ్, ఉపసర్పంచ్ రఫిక్ పాష, పార్టీ నాయకులు షఫీ, షెర్‌ఖాన్, మోహిన్‌పాష, ఖలీల్, మోహిజ్, బుక్కపాష తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్తలకు సన్మానం



సామాజిక కార్యకర్తను సన్మానిస్తున్న డిపో మేనేజర్ ఉపేందర్

మర్పల్లి: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ప్రయాణికులను ప్రోత్సహిస్తున్న సామాజిక కార్యకర్తలను సంగారెడ్డి ఆర్టీసీ డీపో రీజినల్ మేనేజర్లు, డీపో మేనేజర్ ఆదివారం డీపో ప్రాంగణంలో సన్మానించారు. సంగారెడ్డి డీపో పరిధిలోని ధనసిరి ప్రకాష్‌ను (తుమ్మలపల్లి) సామాజిక కార్యకర్తను మేనేజర్ ఉపేందర్ సత్కరించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి డీపో నుంచి మర్పల్లి వరకు నిత్యం ఉదయం, సాయంత్రం వేళలో బస్సులో పలు గ్రామాల విద్యార్థులు, ప్రజలు పయనించేందుకు ప్రకాష్ ఎంతగానో కృషి చేసినట్లు మేనేజర్ ఉపేందర్ తమతో పేర్కొనడం సంతోషంగా ఉందని, తమను సన్మానించిన సంస్థ మేనేజర్లు సుదర్శన్, దైవ దినం, ఏడీసీ డీవీరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



ఆలయంలో తిరుప్పావై పారాయణం చేస్తున్న ఆలయ పండితుడు ధరూర్ శ్రీనివాసాచార్యులు

కొడంగల్ రూరల్: శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైభవంగా ధనుర్మాస పూజలు జరిగాయి. ఆదివారం వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసంలో స్వామివారిని గోదాదేవి అమ్మవారు నెలరోజుల పాటు కొలచిన వ్రత విధానాన్ని ఆలయంలో ప్రతీరోజూ ఓ అధ్యాయంగా ఆలయ పండితుడు ధరూర్ శ్రీనివాసాచార్యులు తిరుప్పావై పారాయణం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు తమ గోత్రనామాలతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



వేంకటేశ్వర సన్నిధిలో హన్మంతు ముదిరాజ్

దోమ: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని డీసీసీ ప్రధానకార్యదర్శి హన్మంతు ముదిరాజ్ అన్నారు. మైలారంలో వేంకటేశ్వర స్వామిని ఆయన దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ఏడాదిలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని వేంకటేశ్వరున్ని వేడుకున్నాని చెప్పారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, ఆలయకర్త రాములు, సర్పంచ్ రాజు, ఎంపీటీసీ సభ్యులు రాములు, ఫీల్డ్ అసిస్టెంట్ హన్మంతు, గ్రామస్తులు బోయిని సురేందర్, గోవర్ధన్, నర్సింహులు, నర్సింగ్ నాయక్, రత్నయ్య, గోపాల్, మాసయ్య పాల్గొన్నారు.

ఇన్‌చార్జీలదే పెత్తనం

- ప్రతి డిపార్ట్‌మెంటులోనూ వారే..
- పూర్తిస్థాయి అధికారులు లేక అవస్థలు
- కీలక శాఖలోనూ వారే బాధ్యులు



మండల పరిషత్ కార్యాలయం

యాలాల: పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో మండలంలోని వివిధ శాఖలు ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొస్తున్నాయి. ఏళ్ల తరబడి పూర్తి స్థాయి అధికారులను నియమించకపోవడంతో ముఖ్యమైన శాఖలకు ఇన్‌చార్జీలే దిక్కయ్యారని ప్రజలు, నాయకులు వాపోతున్నారు. వెనుకబడిన మండలంగా పేరున్నప్పటికీ.. రాజకీయ చైతన్యం అధికంగా ఉన్న మండలంగా యాలాలకు పేరుంది. గతంలో రాష్ట్ర మంత్రులుగా పనిచేసిన రాజకీయ నాయకులతో పాటు ప్రస్తుత రాజకీయాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీచైర్‌పర్సన్‌లకు మండల నాయకులే కీలక నేతలుగా వెన్నంటి ఉండి పాలన సాగించేవారు. అటువంటి పేరున్న మండలానికి ఇన్‌చార్జి అధికారుల పెత్తనం శాపంగా మారిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు.

పరిష్కారం కాని సమస్యలు

అభివృద్ధి పనులకు కీలకంగా ఉండే పంచాయతీరాజ్ శాఖకు మండల ఏఈ పోస్టుకు ఇన్‌చార్జి అధికారే ఉన్నారు. దీంతో పాటు మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ), ఇరిగేషన్, ట్రాన్స్‌కో ఇలా ప్రతి శాఖకు ఇన్‌చార్జీలే పెద్దదిక్కుగా మారారు. ఇలా అందరూ వారే ఉండడంతో ప్రతి సర్వసభ్య సమావేశంలో లేవనెత్తే సమస్యలు పరిష్కారానికి దూరం అవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

విద్య, వైద్యంలోనూ వారే..

విద్యాశాఖకు సంబంధించి ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డి సీనియర్ జీహెచ్‌ఎం కావడంతో ఇన్‌చార్జి ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. మండలానికి ఇన్‌చార్జిగా ఉన్న ఆయనకు ఉన్నతాధికారులు బషీరాబాద్ మండలానికి సైతం ఇన్‌చార్జి ఎంఈఓగా విధులు అప్పగించడం విశేషం. దీంతో పాటు పశువైద్యాధికారి పోస్టులోనూ ఇన్‌చార్జి వైద్యుడే ఉన్నారు. బీసీ బాలుర, బాలికల వసతిగృహ హెచ్‌డబ్ల్యూఓగా ఇన్‌చార్జి అధికారే నెట్టుకొస్తున్నారు. దీంతో పాటు గ్రంథాలయ శాఖకు లైబ్రరియన్ పోస్టు ఖాళీగానే ఉంది. పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా ఇన్‌చార్జి ఎంఓగా డాక్టర్ అశ్విని కొనసాగుతున్నారు. వీటితో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎస్‌ఓ(స్పెషల్ ఆఫీసర్) పోస్టు ఖాళీగా ఉండటంతో సీనియర్ సీఆర్‌టీగా ఉన్న గీతారాణికి ఇన్‌చార్జి ఎస్‌ఓ బాధ్యతలు అప్పగించారు. ఇలా ప్రతి శాఖకు ఇన్‌చార్జి అధికారులే మండలానికి దిక్కుగా మారారని మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రేపు సోషల్ టాలెంట్ టెస్ట్

యాలాల: పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో సోషల్ టాలెంట్ టెస్ట్‌ను రేపు(మంగళవారం) నిర్వహించనున్నట్లు ఫోరం బాధ్యులు గాజుల బస్వరాజ్, లాలయ్య, యాదయ్య సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. టాలెంట్ టెస్టులో భాగంగా ప్రతి పాఠశాల నుంచి మీడియం వారిగా ముగ్గురు విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన ముగ్గురు విద్యార్థులను జిల్లా స్థాయిలో నిర్వహించే టాలెంట్ టెస్టుకు ఎంపిక చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ టాలెంట్ టెస్ట్ ప్రక్రియ రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధానికి విద్యార్థులకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు చెప్పారు.

నోటుపుస్తకాల అందజేత



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని సంఘాయిపల్లి గ్రామంలో ఆదివారం అమ్మానాన్న ఆర్గనైజేషన్ సోషల్ సర్వీసు సభ్యులు.. విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఆర్గనైజేషన్ సభ్యులు ప్రవీణ్ కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



కుల్కచర్ల: పాంబండ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



కొడంగల్‌రూరల్: బొడ్రాయికి పూజలు



పరిగి: వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు



పరిగి: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- కేక్‌కట్ చేసి న్యూఇయర్ వేడుకలు జరుపుకొన్న ప్రజలు
- ఎస్పీ కార్యాలయంలో సంబురాలు
- నేతలకు శుభాకాంక్షల వెల్లువ

కుల్కచర్ల: నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు. పలుచోట్ల కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బొడ్రాయికి పూజలు

కొడంగల్ రూరల్: నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. కాలనీవాసులు వెంకటస్వామి, దశరథ్, నాగరాజు, వెంకటయ్యతో పాటు పలువురు బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు.

పరిగి: నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కేరింతలతో యువకులు బాణసంచాలు పేలుస్తూ కేకులు కట్‌చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. పట్టణంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, లొంకహనుమాన్ దేవాయలయాలకు భక్తులు బారులుతీరారు.

కేక్‌కట్ చేసిన ఎస్పీ

అనంతగిరి: వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి సిబ్బందితో కలిసి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసుల సంబురం

విధినిర్వహణలో భాగంగా వికారాబాద్‌లో పోలీసులు శనివారం రాత్రి భారీ పికెటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. అర్ధరాత్రి సీఐ శీను తన సిబ్బందితో కలిసి కేక్‌కట్ చేసి నూతన సంవత్సర సంబురాలు జరుపుకున్నారు.



అనంతగిరి: కేక్ కట్‌చేస్తున్న ఎస్పీ



అనంతగిరి: దేవాలయం వద్ద భక్తుల క్యూ



అనంతగిరి: భక్తుల పూజలు



అనంతగిరి: కేక్‌కట్ చేస్తున్న పోలీసులు

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

యాలాల: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీల ఐక్యవేదిక(లైవ్) జిల్లా రాజు రాథోడ్ డిమాండ్ చేశారు. సేవాలాల్ జయంతి రోజున అన్నదానం, తదితర కార్యక్రమాలతో గిరిజనులు బిజీగా ఉంటారని పేర్కొన్నారు. వీటితో పాటు గిరిజనులకు ఇబ్బందికరంగా మారిన పోడు భూముల సమస్య పరిష్కారంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

ఘనంగా మల్లన్న బోనాలు

చేవెళ్ల: మల్లన్న బోనాల ఉత్సవాలు ప్రొద్దటూరు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి మల్లన్న ఆలయం వరకు మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్తుండగా.. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పునకాలు యువకుల కేరింతల మధ్య ఉత్సాహంగా సాగాయి. శంకర్‌పల్లి మండలంలోని ప్రొద్దటూరు గ్రామస్తులకు మల్లన్న స్వామికి ప్రతి ఏడాది సంక్రాంతి నెలలో బోనాల ఉత్సవాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు ఉదయాన్నే వంటావార్పుతో బోనాలు తయారు చేసి, సాయంత్రం మల్లన్నకు బోనాలను సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.